సాక్షి
మంచిర్యాల
బుధవారం। 28। ఆగస్టు। 2024



పంచాయతీలకు 'గూడు' కరువు
బెల్లంపల్లి నియోజకవర్గంలో గ్రామ పంచాయతీలకు పక్కా భవనాలు కరువయ్యాయి. అద్దె భవనాల్లో అసౌకర్యాల మధ్య పాలకవర్గాలు ఇబ్బందులు పడుతున్నాయి. 9లో▸



ఘనంగా తీజ్ ఉత్సవాలు
దండేపల్లి: మండలంలోని లింగాపూర్‌లో మంగళవారం లంబాడా గిరిజనులు తీజ్ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆటపాటలతో ఊరేగింపుగా వెళ్లి నిమజ్జనం చేశారు.

గరిష్టం/కనిష్టం
33.0 /26.0

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పడమర దిశగా ఈదురుగాలులు బలంగా వీస్తాయి. గాలిలో తేమ శాతం అధికంగా ఉంటుంది.

దోమలే జ్వరాలకు కారణం

- వ్యాప్తిని అరికట్టాలి
- నియంత్రణ చర్యలు లేక ప్రబలుతున్న వ్యాధులు
- మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుడు అభినవ్
- 'సాక్షి' ఫోన్ ఇన్‌కు స్పందన

సాక్షి ఫోన్ ఇన్

మంచిర్యాలఅర్బన్: 'ప్రాణాంతక వ్యాధుల బారిన పడకుండా దోమల వ్యాప్తిని అరికట్టాలి. దోమల నియంత్రణ చర్యలు లేకపోవడమే జ్వరాలు ప్రబలడానికి కారణం. పరిసరాల పరిశుభ్రతతోనే దోమల నివారణ సాధ్యం..' అని మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఎండీ(జనరల్ ఫిజిషియన్) డాక్టర్ అభినవ్ అన్నారు. జిల్లాలో ప్రబలుతున్న వైరల్, డెంగీ, చికున్‌గున్యా జ్వరాలపై మంగళవారం 'సాక్షి' నిర్వహించిన ఫోన్ ఇన్‌కు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ప్రజల సందేహాలను నివృత్తి చేశారు. జ్వరపీడితుల కోసం మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ప్రత్యేక గది(ఫీవర్ క్లినిక్)లో అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఇళ్లు, పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తలుపులు, కిటికీలకు దోమతెరలు బిగించుకోవాలని, దోమలు కుట్టకుండా చూసుకుంటే డెంగీ బారిన పడకుండా కాపాడుకోవచ్చని, అవగాహన ఎంతో అవసరమని సలహాలు ఇచ్చారు.


వైరల్ ఫీవర్ పెరుగుతున్నాయి. ప్లేట్‌లెట్లు పడిపోకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి.
– కాసర్ల శ్రీనివాస్, బెల్లంపల్లి

వైద్యుడు: ఈడిస్ ఈజిప్టి దోమ పగటి పూట కుడుతుంది. తిరిగి ఇంట్లో కప్‌బోర్డులో దుస్తుల మధ్యలో దాగి ఉండే వీలుంటుంది. ఇంట్లోకి దోమలు రాకుండా చూసుకోవాలి. దోమలు కుట్టకుండా చూసుకుంటే డెంగీని పూర్తిగా నివారించుకోవచ్చు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. పాతటైర్లు, కొబ్బరి చిప్పలు, పూలకుండీల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. దోమతెరలు బిగించుకుంటే వైరస్ వ్యాపించకుండా చూసుకోవచ్చు.

దోమకాటు వల్ల వచ్చే జ్వరాలు, దురదలకు చికిత్స ఏమిటి..
– అశోక్, గ్రామం: జన్కపూర్, మం: కన్నెపల్లి



ఫోన్‌లో మాట్లాడుతున్న వైద్యుడు అభినవ్



వైద్యుడు: డెంగీ జ్వరం అనేది బాధాకరమైన, బలహీనపరిచే దోమల ద్వారా సంక్రమించే వ్యాధి. మూడు రోజుల్లో తగ్గిపోతుంది. పారాసిటమాల్ వేసుకుంటే సరిపోతుంది. ఒక వేళ ఐదు రోజుల తర్వాత కూడా తగ్గకుండా ఉంటే డెంగీ జ్వరాన్ని నిర్ధారించుకోవడానికి రక్తపరీక్షలు అవసరం. సీబీపీ, సీబీసీ పరీక్షలు చేయించుకోవాలి. ఆరోగ్యవంతమైన వ్యక్తికి 1.50లక్షల నుంచి నాలుగు లక్షలపైన ప్లేట్‌లేట్లు ఉంటాయని అంచనా. డెంగీ వైరస్ సోకినప్పుడు ప్లేట్‌లేట్ల కౌంట్ చాలా తక్కువ స్థాయికి పడిపోయే అవకాశాలు ఉంటాయి. కొన్ని సందర్భాల్లో ఒక రోజులో క్షీణతను గమనించవచ్చు. వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలి.

జ్వరం తగ్గినా కీళ్లనొప్పులు ఎక్కువగా ఉన్నాయి.
– పద్మ, మంచిర్యాల

వైద్యుడు: చికున్ గున్యా వైరస్ దోమకాటు ద్వారా సోకుతుంది. జ్వరం, కీళ్లనొప్పులు కలిగిస్తుంది. చికున్‌గున్యా జ్వరం, కీళ్ల నొప్పులు ప్రధాన లక్షణాలు. రక్తపరీక్ష ద్వారా నిర్ధారిస్తారు. కొంతమందికి రెండు వారాలపైనే నొప్పులు ఉండొచ్చు. చర్మం మీద దద్దుర్లు కూడా రావొచ్చు. వైరస్ స్వభావం వల్ల వస్తుంది. వైద్యులను సంప్రదిస్తే మంచిది.

మా ఊరిలో విష జ్వరాలు వ్యాప్తిస్తున్నాయి. చర్యలేమిటి..?
– వెంకటేశ్, గ్రామం: మెంటుపల్లి, మం: కన్నెపల్లి

వైద్యుడు: డెంగీ జ్వరం అనేది దోమల ద్వారా సంక్రమించే వ్యాధి. దోమలు రాకుండా చూసుకోవాలి. బకెట్లు, పూల కుండీ, నిల్వనీటిలో ఎక్కువగా దోమలు వ్యాప్తి చెందుతాయి. పగటి పూట దోమలు కుడుతాయి. జ్వరం వచ్చిన మూడు రోజుల్లో తగ్గిపోతుంది. లేదంటే పరీక్షలు చేయించుకుంటే మంచిది.

జ్వరపీడితులు ఎక్కువగా ఉన్నారు. అందుబాటులో పీహెచ్‌సీ, వైద్యశిబిరాలు ఏర్పాటు చేయండి.
– వెంకటేశ్, నరేందర్, కన్నెపల్లి

వైద్యుడు: జ్వరపీడితులు పెరగకుండా దోమల నివారణ చర్యలు అవసరం. పీహెచ్‌సీతోపాటు క్యాంపుల ఏర్పాటుపై వైద్య ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాను.

వైరల్‌ఫీవర్ ఎక్కువగా ఉంది. బీపీ తగ్గిపోతుంది.
– రాజు, అల్గాం



మంచిర్యాల ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఫీవర్ క్లినిక్

వైద్యుడు: జ్వరం వచ్చిన రెండో రోజు కొద్దిగా ఎక్కువగా ఉంటుంది. మూడు, నాలుగు రోజుల్లో తగ్గిపోతుంది. జ్వరం నయం కాకుండా బీపీ తగ్గిపోతుంటే వెంటనే ఆసుపత్రికి వెళ్లాలి. అవసరమైన రక్త పరీక్షలు చేయించుకోవాలి. వైద్యుల సూచనలు పాటించాలి.

ఊరంతా జ్వరాలబారిన పడి ఆసుపత్రికి వెళ్లి వస్తున్నారు. ఎలాంటి జాగ్రత్తలు అవసరం.
– శ్యాంగౌడ్, తాళ్లగురిజాల

వైద్యుడు: దోమలు లేకుండా చూసుకోవాలి. నిల్వ నీరు ఉంచుకోరాదు. జ్వరం బారిన పడి యాంటీబెటిక్ వాడరాదు. మందులు వైరస్‌కు పనిచేయవు. దోమల నివారణ ఒక్కటే మార్గం.

డెంగీ జ్వరం లక్షణాలు ఏమిటి..?
– అయిలయ్య, మందమర్రి,

వైద్యుడు: డెంగీ జ్వరం ఆకస్మిక అధిక జ్వరం, తల నొప్పి, కళ్లు, వెన్ను నొప్పి, కండరాల నొప్పి, అలసట, వికారం, వాంతులు అవుతుంటాయి. చర్మంపై దద్దుర్లు జ్వరం ప్రారంభమైన రెండు రోజుల నుంచి ఐదు రోజుల తర్వాత కనిపిస్తాయి.

ఏజెన్సీలో జ్వరాలు ఎక్కువగా ఉంటున్నాయి. వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తే బాగుంటుంది. బస్తీ దవాఖానా ఏర్పాటు చేయాలి.
– మోసీన్, గ్రామం: కవ్వాల్, మం: జన్నారం

వైద్యుడు: సాధ్యమైనంత మేర దోమల నివారణ ముఖ్యం. దోమల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. బస్తీదవాఖానా, ఆరోగ్య శిబిరాల విషయంపై వైద్యాధికారుల దృష్టికి తీసుకెళ్తాను.

న్యూస్‌రీల్

ఖర్గేను కలిసిన ఎమ్మెల్యే వినోద్



ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేతో ఎమ్మెల్యే దంపతులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ మంగళవారం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గేను కలుసుకున్నారు. సతీమణి రమాతో కలిసి న్యూఢిల్లీకి వెళ్లిన ఎమ్మెల్యే మర్యాద పూర్వకంగా ఖర్గేను కలిసి రాష్ట్ర తాజా రాజకీయ పరిస్థితులపై చర్చించినట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో మంత్రివర్గ విస్తరణ జరగనుందనే సమాచారంతో కుటుంబ సమేతంగా వెళ్లి ఏఐసీసీ అధ్యక్షుడిని కలవడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

ఆర్టీసీ ఉద్యోగుల నిరసన



డిపో ఎదుట నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

మంచిర్యాలఅర్బన్: ఆర్టీసీ ఉద్యోగుల దీర్ఘకాలిక పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ టీజీఎస్‌ఆర్టీసీ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం మంచిర్యాల డిపో ఎదుట నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఉద్యోగులకు రావాల్సిన ఆర్థిక పరమైన అంశాలను అమలు చేస్తూ, ప్రస్తుతం ఉన్న హక్కులను కొనసాగిస్తూ ప్రభుత్వంలో విలీనం చేయాలని అన్నారు. ట్రేడ్ యూనియన్లు పునరుద్ధరించాలని, 2017 వేతన సవరణ బకాయిలను వెంటనే చెల్లించాలని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతన సవరణ చేయాలని డిమాండ్ చేశారు. అలవెన్స్‌లు అమలు చేయాలని, కొత్త బస్సులు కొనుగోలు చేయాలని, ఎలక్ట్రికల్ బస్సులను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని పేర్కొన్నారు.

ఫర్టిలైజర్ షాపుపై 'విజిలెన్స్'



తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ఫర్టిలైజర్స్ షాపుల్లో నిబంధనలకు విరుద్ధంగా ఎరువుల విక్రయాలు సాగుతున్నట్లు కరీంనగర్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులు గుర్తించారు. మంగళవారం జైపూర్ మండలం కుందారంలో సత్యనారాయణ ఫర్టిలైజర్స్‌లో తనిఖీలు నిర్వహించారు. రూ.3.37లక్షల విలువైన 21.20 మెట్రిక్ టన్నుల ఎరువులను నిబంధనలకు విరుద్ధంగా అమ్మినట్లు గుర్తించారు. దుకాణంలోని రూ.4.42లక్షల విలువైన 17.90మెట్రిక్ టన్నుల ఎరువులను స్థానిక వ్యవసాయ అధికారులకు అప్పగించారు. ఈపీవోఎస్(ఎలక్ట్రానిక్ పాయింట్ ఆఫ్ సేల్)తో విక్రయించాల్సి ఉండగా.. ఈపీవోఎస్‌లో నమోదు చేయకుండా నేరుగా అమ్మినట్లు రికార్డుల పరిశీలనలో వెల్లడైనట్లు అధికారులు తెలిపారు. స్థానిక మండల అధికారి మార్క్‌గ్లాస్టన్‌ను 'సాక్షి' సంప్రదించగా.. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ గుర్తించిన వాటిపై పూర్తి స్థాయిలో విచారణ చేపడుతామని పేర్కొన్నారు. ఎక్కడైనా తేడాలు ఉంటే చట్టప్రకారం కేసు నమోదు చేస్తామని తెలిపారు. మరోవైపు జిల్లాలో ఎరువులు, విత్తనాల దుకాణాల్లో పకడ్బందీగా నిఘా లేకపోవడంతో డీలర్లు అమ్మకాల్లో నిబంధనలు అతిక్రమిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఇక రైతులకు అవసరం లేని పురుగుల మందులను సైతం అంటగట్టడం, తమకు లాభాలు ఇచ్చే కంపెనీ ఎరువులను అమ్మిస్తున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయి.

విస్తరిస్తున్న డెంగీ జ్వరాలు

- ప్రభుత్వ ఆస్పత్రిలో నాలుగు కేసులు
- ప్రైవేట్‌లో మరిన్ని నమోదు



చెన్నూర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

చెన్నూర్: చెన్నూర్, కోటపల్లి మండలాల్లో డెంగీ జ్వరాలు చాపకింద నీరులా విస్తరిస్తున్నాయి. నెల రోజుల వ్యవధిలోనే చెన్నూర్ సామాజిక ఆరోగ్య కేంద్రంలో నాలుగు కేసులు నమోదయ్యాయి. జ్వరాలతోపాటు దగ్గు, జలుబు సమస్యలు తీవ్రంగా వేధిస్తున్నాయి. గత నెల రోజులుగా విషజ్వరాలతో అల్లాడుతున్న రోగులు డెంగీ బారిన పడడంతో ఆందోళన చెందుతున్నారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో పదుల సంఖ్యలో డెంగీ కేసులు నమోదైనట్లు సమాచారం. చెన్నూర్ సామాజిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం 140మందికి పైగా రక్త పరీక్షలు నిర్వహించారు. వాతావరణంలో మార్పుల కారణంగా నెల రోజులుగా వైరల్ జ్వరాలు పట్టి పీడిస్తున్నాయి. సాధారణ జ్వరాలే కదా అని చికిత్స పొందుతుండగా వారం రోజులపాటు మంచం దిగని పరిస్థితి ఏర్పడుతోందని చెన్నూర్‌కు చెందిన పల్లె రాజయ్య తెలిపాడు. కొందరు జ్వర బాధితులకు రక్తకణాలు పడిపోతున్నాయి. దీంతో బాధితులు భయాందోళన చెందుతున్నారు. రక్తకణాలు పడిపోయి డెంగీ లక్షణాలు ఉన్న వారికి ప్రత్యేక చికిత్స అందిస్తున్నామని వైద్యులు తెలిపారు.

నిర్లక్ష్యం చేస్తే ప్రమాదం
మూడేళ్ల క్రితం చెన్నూర్, కోటపల్లి, వేమనపల్లి మండలాల్లో డెంగీ జ్వరాలతో ముగ్గురు చనిపోయారు. వేమనపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహించిన వైద్యులు సైతం మృతిచెందిన ఘటనలు ఉన్నాయి. మూడేళ్ల తర్వాత మళ్లీ చెన్నూర్ ఏరియాలో డెంగీ కేసులు నమోదు కావడంపై అధికార యంత్రాంగం అప్రమత్తం కావాల్సిన అవసరం ఉంది. డెంగీని నిర్లక్ష్యం చేస్తే పెను ప్రమాదం సంభవించే పరిస్థితులు లేకపోలేదని వైద్యులు సూచిస్తున్నారు.

మార్చిలోగా పనులు పూర్తి చేయాలి



వైద్య కళాశాల పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు, అధికారులు, నాయకులు

- మంచిర్యాల ఎమ్మెల్యే కే.ప్రేంసాగర్‌రావు
- వైద్య కళాశాల నిర్మాణ పనుల పరిశీలన

మంచిర్యాలరూరల్(హాజీపూర్): వచ్చే ఏడాది మార్చిలోగా వైద్య కళాశాల నిర్మాణ పనులు పూర్తి చేయాలని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. మంగళవారం హాజీపూర్ మండలం గుడిపేట గ్రామ శివారులో ప్రభుత్వ వైద్య కళాశాల భవన నిర్మాణ పనులను ఆయన పర్యవేక్షించారు. అంతకుముందు దొనబండలో 33/11 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. గుడిపేటలో వైద్య కళాశాల ప్రాంగణంలోని బాలబాలికల వసతిగృహాలతోపాటు వైద్య కళాశాల భవనాల నిర్మాణాలను పరిశీలిస్తూ గదుల సంఖ్య, విద్యార్థుల పరిమితి, వైద్య కళాశాలలో ఉన్న ల్యాబ్‌లు, తరగతి గదులు, సెమినార్ గదులు, మ్యూజియం, అనాటమీ తదితర విభాగాలకు సంబంధించిన నిర్మాణ పనుల పరిస్థితిని తెలుసుకున్నారు. రోడ్లు, భవనాల శాఖ మంచిర్యాల డీఈఈ రమేశ్, కళాశాల నిర్మాణ పర్యవేక్షణ జేఈ అనూష, ప్రాజెక్ట్ జనరల్ మేనేజర్ సంపూర్ణరావు పాల్గొన్నారు.

నియోజకవర్గంలోనే మిల్లులు, గోదాములు..
నియోజకవర్గంలోనే రైస్‌మిల్లులు, గోదాములు ఏర్పాటు కానున్నాయని ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు తెలిపారు. దండేపల్లిలో రెండు, లక్సెట్టిపేట, హాజీపూర్‌లకు కలిపి మొత్తం నాలుగు రైస్‌మిల్లులను ఐకేపీ సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్, డీఆర్‌డీఓ కిషన్, డీపీఓ వెంకటేశ్వర్‌రావు, ఆర్డీఓ రాములు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు
పాతమంచిర్యాల: ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఏసీసీ సబ్‌స్టేషన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆయన మంగళవారం ప్రారంభించారు. విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రావణ్, డీఈ కైసర్, ఏడీఈ వేణుగోపాల్ పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి
దండేపల్లి: నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు అన్నారు. మండలంలోని లింగాపూర్, దండేపల్లి, రెబ్బనపల్లి గ్రామాల్లో మంగళవారం ఆయన అధికారులతో కలిసి పర్యటించారు. లింగాపూర్ మోడల్ స్కూల్‌ను సందర్శించి విద్యార్థులు, సిబ్బందితో మాట్లాడారు. దండేపల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీని సందర్శించి నూతన భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. అన్ని కులాలకు ఒకే చోట సుమారు 4వేల మంది విద్యార్థులకు రెసిడెన్షియల్ స్థాయి పాఠశాల ఏర్పాటుకు రెబ్బనపల్లి శివారులో స్థల పరిశీలన చేశారు. జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్, ఆర్డీవో రాములు, డీఈవో యాదయ్య, డీపీవో వెంకటేశ్వర్లు, జిల్లా వైద్యాధికారి హరీశ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

తెగిన పేగు వీడని రక్త బంధం



వాగు వద్ద గుమిగూడిన జనం, ఇన్‌సెట్‌లో విజయ్, ఆకాశ్, అక్షయ్ మృతదేహాలు

తమ్ముడూ.. నువ్వులేకుంటే మేమెట్ల బతుకతామనుకున్నారో ఏమో.. ఈత రాకున్నా ప్రాణాలకు తెగించారు ఆ అన్నలు. ఎలాగైనా తోబుట్టువును రక్షించాలని భావించారు.. అయితే వారి ప్రయత్నాన్ని విధి అడ్డుకుంది. ముగ్గురినీ నీటి మాటున మింగేసింది. తిరిగిరాని లోకాలకు చేర్చింది. కన్నవారికి కడుపుకోత.. కట్టుకున్న వారికి పుట్టెడు దుఃఖం మిగిల్చిన ఈ ఘటన హృదయ విదారకం.

- వాగులో గల్లంతైన అన్నదమ్ముళ్లు
- తమ్ముడిని రక్షించబోయి ఇద్దరన్నలూ మృతి
- ముగ్గురి ప్రాణాలు తీసిన చేపల వేట
- ఉపాధి కోసం వచ్చి అనంత లోకాలకు..

ఆదిలాబాద్‌రూరల్/ఆదిలాబాద్‌టౌన్: సొంత ఊరిని వదిలి ఉపాధి నిమిత్తం వలస వచ్చిన ముగ్గురు అన్నదమ్ముళ్లు కానరాని లోకాలకు వెళ్లిపోయారు. ఈ ఘటన ఆదిలాబాద్ జిల్లా ఆదిలాబాద్ రూరల్ మండల పరిధిలో చోటు చేసుకుంది. వ్యవసాయ కూలీలుగా పనిచేస్తున్న వీరు మంగళవారం ఖాళీగా ఉండడంతో సరదాగా చేపల వేట కోసం వెళ్లి విగతజీవులుగా మారారు. ఈత రాకపోవడం, కళ్ల ముందే తమ్ముడు నీటిలో కొట్టుకుపోతుండడంతో ఇద్దరు సోదరులు అతన్ని రక్షించే ప్రయత్నం చేశారు. వారికి సైతం ఈత రాకపోవడంతో ముగ్గురూ గల్లంతయ్యారు. వారితో పాటు వెళ్లిన మరో వ్యక్తి నిస్సహాయ స్థితిలో ఉండిపోయాడు. అరుపులు, కేకలు వేసినప్పటికీ చుట్టుపక్కల ఎవరూ అందుబాటులో లేరు. అప్పటికే ఘోరం జరిగిపోయింది. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అన్నదమ్ముళ్లు మృతిచెందడంతో ఆ కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. ఆ తల్లికి కడుపు కోత మిగలగా, వారి కుటుంబాలు వీధినపడ్డాయి.



రోదిస్తున్న కుటుంబ సభ్యులు

కూలీ పనుల కోసం వచ్చి..
మహారాష్ట్రలోని నాందేడ్‌కు చెందిన నాగుల్వార్ రాజు–మీనాబాయి దంపతులకు ముగ్గురు కుమారులు. వీరిలో పెద్దవాడు విజయ్(28). మరో ఇద్దరు ఆకాశ్(26), అక్షయ్(22). ముగ్గురు అన్నదమ్ముళ్లు ఉపాధి నిమిత్తం ఆదిలాబాద్ జిల్లాకు ఇటీవల వలస వచ్చారు. తాంసి మండలంలోని బండల్‌నాగాపూర్ గ్రామానికి వారం క్రితం చేరుకున్నారు. ఓ ఇంట్లో అద్దెకు ఉంటూ వ్యవసాయ కూలీలుగా పనిచేస్తున్నారు. సొంత ఊరిలో ఉపాధి కరువై పొట్టచేత పట్టుకొని వచ్చిన వీరి కుటుంబంలో పది రోజులు గడవక ముందే విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ ముగ్గురికి వివాహాలయ్యాయి. అక్షయ్‌కు ఆరు నెలల క్రితం పెళ్లి జరిగింది. విజయ్‌కు 10 నెలల కుమారుడు ఉన్నాడు.

ప్రాణం తీసిన చేపల వేట..
సరదాగా చేపల వేట కోసం వెళ్లిన అన్నదమ్ముళ్లు వాగులో గల్లంతై మృత్యువాత పడ్డారు. ఉదయం 10.30 గంటల సమయంలో ఊరికి ఆనుకొని ఉన్న పొచ్చర వాగుకు వెళ్లారు. చేపలు పట్టే క్రమంలో అక్షయ్ ప్రమాదవశాత్తు కాలుజారి వాగులో పడ్డాడు. కళ్ల ముందే తమ్ముడు ప్రాణాలతో కొట్టుమిట్టాడుతుంటే చూసి ఈత రాకపోయినప్పటికీ ఆ అన్నదమ్ములిద్దరు వాగులోకి దూకారు. తమ్ముడిని రక్షించబోయి వారు సైతం గల్లంతయ్యారు. పోలీసులు వచ్చి గజఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టి మృతదేహాలను వెలికితీశారు. రూరల్ ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు.

వీధినపడ్డ కుటుంబం..
ఒకే కుటుంబంలో ముగ్గురు అన్నదమ్ముళ్లు మృతిచెందడంతో ఆ పేద కుటుంబం రోడ్డున పడింది. కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న కుమారులు ఒకేసారి మరణించడంతో తల్లిదండ్రులతో పాటు కుటుంబసభ్యులు జీర్ణించుకో లేకపోతున్నారు. సంఘటనస్థలంలో వారు రోదించిన తీరు కంటతడి పెట్టించింది. విషయం తెలియడంతో బండల్‌నాగాపూర్, పొచ్చర, దిమ్మ, తదితర గ్రామాల ప్రజలతోపాటు పలువురు పెద్దసంఖ్యలో అక్కడికి చేరుకున్నారు.

ఎస్టీపీపీని నంబర్–1గానే నిలపాలి

- డిప్యూటీ సెక్రెటరీ మినిస్ట్రీ ఆఫ్ కోల్ దర్శన్‌కుమార్

జైపూర్: విద్యుత్ ఉత్పత్తి సాధన(పీఎల్ఎఫ్)లో సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటు(ఎస్టీపీపీ) దేశంలో నంబర్–1 నిలుస్తూ అనేక అవార్డులు సాధించిందని, ఇదే ఒరవడిని కొనసాగిస్తూ అత్యుత్తమ పీఎల్ఎఫ్ సాధించాలని డిప్యూటీ సెక్రెటరీ మినిస్ట్రీ ఆఫ్ కోల్, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా నామినేటెడ్ డైరెక్టర్ దర్శన్‌కుమార్ సోలంకి తెలిపారు. మండల కేంద్రంలోని 1200మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. బాయిలర్ కంట్రోల్ రూమ్‌లో కంప్యూటర్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తి ప్రక్రియను పరిశీలించారు. ఎస్టీపీపీ సాధించిన విద్యుత్ ఉత్పత్తి, రాష్ట్రానికి అందించిన విద్యుత్ అంశాలను అధికారులు ఆయనకు వివరించారు. పీఎల్ఎఫ్ సాధనలో దేశస్థాయిలో అగ్రగామిగా నిలువడమే కాకుండా పర్యావరణ పరిరక్షణకు చేపట్టిన చర్యల్లో భాగంగా అనే స్వచ్ఛంద సంస్థల ద్వారా అవార్డులు అందుకున్నట్లుగా తెలిపారు. అనంతరం కర్బన ఉద్గారాలను తగ్గించడం కోసం ఎఫ్‌జీడీ(ఫ్లూగ్యాస్ డిసల్ఫరైజేషన్) ప్లాంటును రూ.700కోట్లతో నిర్మిస్తున్నట్లుగా తెలిపారు. ఎఫ్‌జీడీ నిర్మాణాలతోపాటు సోలార్, ఫ్లోటింగ్ సోలార్‌లను పరిశీలించారు. ఈడీ రాజశేఖర్‌రావు, వోఅండ్ఎం చీఫ్ జెన్‌సింగ్, జీఎం పీసీఎస్ శ్రీనివాసులు, ఏజీఎంలు రమణ, ఫారెస్టు మేనేజర్ చంద్రమణి, ఎస్‌వోటు ఈడీ ప్రభాకర్‌రావు, ఎస్‌వోటు జీఎం వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ ఉత్పత్తి ప్రక్రియను పరిశీలిస్తున్న దర్శన్‌కుమార్

పండుగలు శాంతియుతంగా జరుపుకోవాలి

- రామగుండం సీపీ శ్రీనివాసులు
- శాంతికమిటీ సమావేశం

మంచిర్యాలక్రైం: శాంతియుత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలని రామగుండం పోలీసు కమిషనర్ ఎం.శ్రీనివాసులు అన్నారు. రామగుండం కమిషనరేట్ ఆవరణలో మంగళవారం మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాలకు చెందిన వివిధ మతాల పెద్దలు, శాంతికమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. సలహాలు, సూచనలు తీసుకున్నారు. అనంతరం సీపీ శ్రీనివాసులు మాట్లాడుతూ గణేష్ చతుర్థి, మిలాద్ ఉన్ నబి పండుగలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని అన్నారు. గత ఏడాది మంచిర్యాల జిల్లాలో 1981 వినాయక విగ్రహాలు నెలకొల్పారని, ఈసారి ఆ సంఖ్య పెరిగే అవకాశం ఉందని చెప్పారు. సోషల్ మీడియాలో వచ్చే అసత్య ప్రచారాలను నమ్మి శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దని, ఏదైనా సమాచారం ఉంటే కమిషనరేట్‌లోని కంట్రోల్ రూం 8712656597, డయల్ 100 నంబర్లకు అందించాలని తెలిపారు. ఈ సమావేశంలో డీసీపీలు భాస్కర్, చేతన, ఏసీపీలు ప్రకాష్, వెంకటేశ్వర్లు, రవికుమార్, మల్లారెడ్డి, రాఘవేంద్రరావు, నర్సింహులు, వెంకటస్వామి, ప్రతాప్, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీ శ్రీనివాసులు

క్లుప్తంగా

పత్తి ధ్వంసం చేసిన ఇద్దరిపై కేసు



ధ్వంసమైన పత్తి మొక్కలు

కోటపల్లి: పత్తి పంట ధ్వంసం చేసిన ఇద్దరిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజేందర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని వెలమపల్లి గ్రామంలో సత్తిరెడ్డికి చెందిన ఎకరం భూమిలో పత్తి సాగు చేస్తున్నాడు. సత్తిరెడ్డి కుటుంబ సభ్యుల తగాదాల కారణంగా ఐత బాపురెడ్డి, ఐత రాజేశ్‌లు చేనులో చొరబడి పత్తి మొక్కలు ధ్వంసం చేశాడు. సుమారు రూ.50 వేల నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మట్కా ఆడుతున్న ఒకరిపై కేసు

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని నౌగాంబస్తీలో ఆన్‌లైన్ మట్కా జూదం ఆడుతున్న యువకుడిని మంగళవారం పట్టుకుని కేసు నమోదు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ రాణాప్రతాప్ తెలిపారు. పక్కా సమాచారంతో తనిఖీలు నిర్వహించగా, ఎస్‌కె అజీల్ మట్కా ఆడుతూ పట్టుబడ్డాడని పేర్కొన్నారు. అతని వద్ద నుంచి రూ.2 వేల నగదు, ఒక సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కాగజ్‌నగర్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో అప్పజెప్పినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ పేర్కొన్నారు.

కొండచిలువ పట్టివేత



కొండచిలువను పట్టుకున్న స్నేక్ స్నాచర్స్‌తో బీట్ ఆఫీసర్

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని కేకే–ఓసీ వద్దకు మంగళవారం కొండచిలువ వచ్చింది. స్థానికులు గమనించి ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రాజేశ్వరికి సమాచారం అందించారు. స్నేక్ స్నాచర్స్‌తో వచ్చి కొండచిలువను పట్టుకుని సమీపంలోని అటవీప్రాంతంలో వదిలారు. ఈ సందర్భంగా రాజేశ్వరి మాట్లాడుతూ జనావాసాల్లో విషసర్పాలు సంచరిస్తే సమాచారం అందించాలన్నారు.

ఆస్తుల పరిరక్షణలో సెక్యూరిటీ విభాగం కీలకం



మాట్లాడుతున్న దీక్షితులు

నస్పూర్: సింగరేణి సంస్థ ఆస్తుల పరిరక్షణలో సెక్యూరిటీ విభాగం కీలకమని సెక్యూరిటీ జనరల్ మేనేజర్ బీఆర్.దీక్షితులు అన్నారు. ఆయన మంగళవారం అన్ని ఏరియాల సెక్యూరిటీ అధికారులతో సీసీసీ సింగరేణి గెస్టుహౌజ్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి ఆస్తుల పరిరక్షణ, గనుల డిపార్ట్‌మెంట్లు, ఓపెన్ కాస్ట్ గనులలో అక్రమాలు, దొంగతనాల అరికట్టడం వంటి వాటిపై దృష్టి సారించాలని సూచించారు. ఏరియా ఇంచార్జి జీఎం శ్రీనివాస్, డీజీఎం అరవిందరావు, అధికారులు వేణుమాధవ్, మురళీమోహన్ పాల్గొన్నారు.

మైదానంపై పట్టింపేది?

- వెలుగని లైట్లు
- అధ్వానంగా వాకింగ్ ట్రాక్
- ప్రారంభం కాకముందే కూలిన సైడ్ డ్రెయిన్



వాకింగ్ ట్రాక్‌పై పోసిన మట్టి



ప్రాణహిత స్టేడియంలో ఉదయం వెలగని లైట్లు

శ్రీరాంపూర్: అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా తయారైంది సింగరేణి పరిస్థితి. రూ.లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన హైమాస్ లైట్లు నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో వృథాగా మారుతున్నాయి. ఇందుకు నస్పూర్ నాగార్జున కాలనీ సమీపంలోని సింగరేణి ప్రాణహిత స్టేడియం నిదర్శనం. సింగరేణి కాలనీవాసులు, తాళ్లపల్లి, సింగపూర్ ఓసీపీ నిర్వాసితుల కోసం ఇక్కడ ఏర్పాటు చేసి ఆర్‌అండ్ కాలనీవాసుల, క్రీడాకారుల సౌకర్యార్థం ఇక్కడ కంపెనీ విశాలమైన మైదానం ఏర్పాటు చేసింది. వాకింగ్ ట్రాక్, పిల్లలు ఆడుకునే ఆట సామగ్రి, ఫిట్‌నెస్ కోసం స్టాండ్ బార్‌లు ఏర్పాటు చేశారు. మైదానం చుట్టూ రూ.లక్షలు వెచ్చించి హైమాస్ లైట్లు ఏర్పాటు చేశారు. కాని అవి వెలగడం లేవు. మొదట్లో కొద్ది రోజులు బాగానే పని చేశాయి. కాని నెల రోజులుగా వెలుగడం లేదు. వర్క్‌షాప్ అధికారులు, సిబ్బంది పట్టించుకోకపోవడంతో సాయంత్రం, ఉదయం వేళ వాకింగ్, ఇతర ఫిట్ కోసం వచ్చేవారు చీకట్లో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అసలే వర్షాకాలం కావడంతో విషపురుగులు, సర్పాల బారిన పడుతామనే భయం నెలకొంది. ఇంత ఖర్చు పెట్టి ఏర్పాటు చేసిన లైట్ల నిర్వహణను అధికారులు గాలికొదిలేయడంపై విమర్శలు వస్తున్నాయి.

వాకింగ్ ట్రాక్ బాగు చేయాలి

మైదానంలో దాదాపు పనులు పూర్తయి చాలాకాలం అయిన కంపెనీ అధికారికంగా ప్రారంభించలేదు. క్రీడాకారులు, వాకింగ్ వచ్చేవారితో నిత్యం మైదానం కళకళలాడుతుంది. మైదానంలో కొంత మేర మట్టిపోసి లెవలింగ్ చేయాల్సి ఉంది. వాకింగ్ ట్రాక్ వేసినప్పటికి వర్షానికి మట్టి కొట్టుకుపోయి అధ్వానంగా మారింది. కనీసం చిన్నపాటి మరమ్మతు చేసినా వాకింగ్‌కు సౌకర్యంగా ఉంటుందని వాకర్లు వాపోతున్నారు. దీనికితోడు మైదానంలో పడమర సైడ్ డ్రెయిన్ కూలింది. ప్రారంభం కాకముందే కూలడంపై నాణ్యతపై విమర్శలు వస్తున్నాయి. డ్రెయిన్‌ను మరమ్మతు కోసం తీసిన మట్టిని ట్రాక్‌పై పోశారు. దీంతో వాకింగ్‌కు మరింత అధ్వానంగా మారింది. ఉన్నా గేట్లు తెరిచి ఉంచడం, మరో వైపు ఫెన్సింగ్ లేకపోవడంతో పశువులు సంచరిస్తున్నాయి. పెరిగిన పిచిమొక్కలను తొలగించి, అసంపూర్తి పనులు చేయించి మైదానం అందుబాటులో తీసుకురావాలని కాలనీవాసులు కోరుతున్నారు.

మరమ్మతు చేపట్టాలి



వాకింగ్ ట్రాక్‌పై నడవాలంటే ఇబ్బందిగా ఉంది. వర్షానికి ట్రాక్ కొట్టుకుపోయింది. వెంటనే మరమ్మతు చేపట్టాలి. లైట్లు కూడా వెలగడం లేదు. వీటిని బాగు చేయాలి. – ఎం.కృష్ణారావు, వాకర్

రిటైర్మెంట్ బెన్‌ఫిట్స్ త్వరగా చెల్లించాలి



మాట్లాడుతున్న జీఎం(పర్సనల్) దీక్షితులు

శ్రీరాంపూర్: రిటైర్మెంట్ బెన్‌ఫిట్స్ త్వరగా చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కార్పొరేట్ జీఎం(పర్సనల్) దీక్షితులు తెలిపారు. శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలో కాన్ఫరెన్స్ హాల్‌లో బెల్లంపల్లి, మందమర్రి, శ్రీరాంపూర్, ఎస్టీపీపీ ఏరియాల పర్సనల్ డిపార్టుమెంట్ల అధికారులతో మంగళవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంప్లాయి పర్సనల్ రికార్డుల డిజిటలైజేషన్ పూర్తి చేయాలన్నారు. రిటైర్మెంట్ అయిన ఉద్యోగులకు సంబంధించిన క్లెయిమ్‌లు త్వరగా పూర్తి చేయాలన్నారు. ఉద్యోగుల హాజరు శాతం పెంచాలన్నారు. గైర్హాజరు కార్మికులకు కౌన్సెలింగ్ నిర్వహించి డ్యూటీలకు సక్రమంగా హాజరయ్యేలా చూడాలన్నారు. కోర్టు కేసులు త్వరగా పూర్తి చేయాలన్నారు. కాంట్రాక్ట్ కార్మికుల హాజరు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు.

దీక్షితులకు సన్మానం..

ఈనెలాఖరుతో రిటైర్డ్ అవుతున్న దీక్షితులను ఏరియా అధికారులు సన్మానించి వీడ్కోలు పలికారు. ఇన్‌చార్జి జీఎం టి.శ్రీనివాస్, అధికారులు ఆయన్ను సత్కరించి కంపెనీలో ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఎస్‌ఓటూ జీఎం సత్యనారాయణ, ఏజెంట్ గోపాల్‌సింగ్, రాముడు, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు కె.వెంకటేశ్వర్‌రెడ్డి, డీజీఎం(పర్సనల్) అరవిందరావు, మందమర్రి ఏరియా పీఎం శ్యాంసుందర్, బెల్లంపల్లి పీఎం తిరుపతి, ఎస్టీపీపీ సంక్షేమ అధికారి మోహన్ సింగ్ పాల్గొన్నారు.

లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలి

- ఆదివాసీ సంఘాల డిమాండ్
- ఏజెన్సీ బంద్ విజయవంతం



రాస్తారోకోలో ఆదివాసీ సంఘాల నాయకులు

దండేపల్లి: లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని ఆదివాసీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఏజెన్సీ బంద్‌లో భాగంగా మంగళవారం దండేపల్లి, తాళ్లపేట, ముత్యంపేట గ్రామాల్లో వ్యాపార సంస్థలు మూసి వేయించారు. అనంతరం ఆదివాసీ సంఘాల నాయకులు రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివాసీ చట్టాలను అమలు చేయాలని, పోడు భూములతోపాటు ఆదివాసీలు తరతరాలుగా సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలని అన్నారు. గిరిజన గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ మండల అధ్యక్షుడు కనక జంగు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోయం జంగు, రాయి సెంటర్ జిల్లా అధ్యక్షుడు రామ్‌పటేల్, మండల అధ్యక్షుడు శ్రీనివాస్, ఆదివాసీ సంఘాల నాయకులు బాపు, ఎల్లయ్య, సోము, మాన్కు, దాము, రాజేష్, జాడి, భీమారావు పాల్గొన్నారు.

స్కౌట్స్, గైడ్స్‌తో క్రమశిక్షణ



మాట్లాడుతన్న జీఎం దేవేందర్

మందమర్రిరూరల్: స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యక్రమాల వల్ల విద్యార్థులకు క్రమశిక్షణ ఏర్పడుతుందని ఏరియా జీఎం దేవేందర్ అన్నారు. ఏరియాలోని సీఐఎస్ఎఫ్ క్యాంపు ఆవరణలో ద భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, సింగరేణి కాలరీస్ డిస్ట్రిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వచ్చేనెల 1 వరకు నిర్వహించే తృతీయ సోపాన్ టెస్టింగ్ క్యాంపు ఫర్ గైడ్స్ కార్యక్రమాన్ని మంగళవారం జీఎం ప్రారంభించారు. గోలేటి, మందమర్రి, శ్రీరాంపూర్, రామగుండం ఏరియాల నుంచి స్కౌట్స్ అండ్ గైడ్స్ పాల్గొననున్నారని తెలిపారు. క్యాంపులో నిర్వహించిన టెస్ట్‌లో ఉత్తీర్ణులైన వారిని గవర్నర్ అవార్డుకు ఎంపిక చేస్తామన్నారు. ఎస్వో టూ జీఎం రాజేశ్వర రెడ్డి, సింగరేణి హైస్కూల్ హెచ్‌ఎం పురుషోత్తం, తదితరులు ఉన్నారు.

శివకేశవ ఆలయంలో పూజలు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

తాండూర్: తాండూర్‌లోని రామ్‌నగర్ బారేవాడలో ఉన్న శివకేశవ ఆలయంలో మంగళవారం సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు ప్రత్యేక పూజలు చేశారు. అభిషేకం చేసి హారతి అందుకున్నారు. కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

ఉరేసుకుని యువతి బలవన్మరణం



శిరీష (ఫైల్)

నస్పూర్: పట్టణ పరిధిలోని శ్రీరాంపూర్ ఏరియా కృష్ణాకాలనీకి చెందిన ఆకుల శిరీష ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. ఎస్సై సంతోష్, స్థానికులు తెలిపిన వివరాలు.. శిరీష (20) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు కంపెనీలో జాబ్ చేస్తుంది. గత మూడు రోజుల క్రితం కృష్ణా కాలనీలోని తన ఇంటికి వచ్చింది. తల్లిదండ్రుల మధ్య మనస్పర్థల కారణంగా విడివిడిగా ఉంటున్నారు. తనను తమ్ముడిని తల్లి కూలి పనిచేసి పోషించింది. తన కుటుంబ పరిస్థితిని, ఆర్థిక ఇబ్బందులను తలుచుకుని మానసిక వేదనకు గురైంది. మంగళవారం తల్లి కూలి పనికి వెళ్లింది. ఆమె మధ్యాహ్నం శిరీషకు ఫోన్ చేయగా లిఫ్ట్ చేయకపోవడంతో ఇంటికి వచ్చి చూసింది. శిరీష ఇంటి పై కప్పునకు చున్నీతో ఉరేసుకుంది. పోలీసులకు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి తల్లి లక్ష్మి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇటిక్యాల వాసికి డాక్టరేట్



వసంత్ సేనా

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని ఇటిక్యాలకు చెందిన వసంత్ సేనాకు గౌరవ డాక్టరేట్ పట్టా పురస్కారం అందుకున్నాడు. జెఎన్‌టీయూ ద్వారా కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం నుంచి 'స్మార్ట్ వాటర్ గ్రిడ్ డీప్ లెర్నింగ్' అనే అంశంపై పీహెచ్‌డీ పూర్తి చేశాడు. ఇందుకుగాను ఈనెల 24న హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ నుంచి ప్రొఫెసర్ సమ్మలాల్ మార్గదర్శకత్వంలో ఈ పట్టా అందుకున్నాడు. వసంత్‌సేనా తల్లిదండ్రులు మల్లికార్జున్ ఆనందా, కుటుంబసభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

సమస్యలు పరిష్కరించాలని ఆందోళన



ఆందోళనలో ఉద్యోగులు, సంఘం నాయకులు

మంచిర్యాలఅగ్రికల్చర్: ఏఈల రిక్రూట్‌మెంటు చేపట్టాలని, ఆర్‌టీఎస్–బీ థర్మల్ పవర్ ప్లాంట్ జెన్‌కో ఆధ్వర్యంలో నిర్మించాలని, పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ భోజన విరామ సమయంలో ట్రాన్స్‌కో ఎస్ఈ కార్యాలయ ఆవరణలో మంగళవారం టీజీపీఈఏ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా టీజీపీఈఏ బ్రాంచ్ సెక్రెటరీ పానుగంటి లక్ష్మణ్ మాట్లాడుతూ ట్రాన్స్‌కో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని, ఏఈలకు పదోన్నతులు కల్పించి కొత్తగా నియామకాలు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు బి.రాజేష్, విలాస్, శరత్, రాజ్‌కుమార్, రవికుమార్, గులాబ్, మహేందర్, సాయికుమార్, పూర్ణచందర్ పాల్గొన్నారు.

కాసిపేట-2 గనిని సందర్శించిన డీడీఎంఎస్



మ్యాన్‌రైడింగ్ సిస్టమ్‌ను పరిశీలిస్తున్న డీడీఎంఎస్ దిలీప్‌కుమార్, అధికారులు

కాసిపేట: మందమర్రి ఏరియా కాసిపేట–2 గనిని మంగళవారం డీడీఎంఎస్(మెకానికల్) దిలీప్‌కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా నూతనంగా ఏర్పాటు చేసిన చైర్‌లిఫ్ట్ మ్యాన్ రైడింగ్ సిస్టమ్‌ను పరిశీలించారు. మ్యాన్‌రైడింగ్ నిర్వహణపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఎలాంటి ఇబ్బందులు, అనుమానాలు ఉన్నా నిలిపివేయాలన్నారు. కేకే గ్రూపు ఏజెంట్ రాందాసు, ఏరియా ఇంజినీర్ వెంకటరమణ, ఏజీఎం ఈఅండ్ఎం రామనాథం, గని మేనేజర్ లక్ష్మీనారాయణ, గ్రూపు ఇంజినీర్ రాంప్రసాద్ తదితరులు ఉన్నారు.

ప్రమాదవశాత్తు కాలువలో పడి మహిళ మృతి



సాగ్రీబాయి మృతదేహం

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని వట్టివాగు కాలువలో మహిళ ప్రమాదవశాత్తు పడి మృతి చెందింది. సీఐ సతీశ్ కథనం ప్రకారం.. మండలంలోని రౌటసంకెపల్లి గ్రామానికి చెందిన జాదవ్ సాగ్రిబాయి(32)కి మహారాష్ట్రకు చెందిన వెంకటేశ్‌తో ఐదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఆరు నెలలుగా సాగ్రిబాయి మతిస్థిమితం లేకపోవడంతో తండ్రి వద్దకు వచ్చి ఉంటుంది. సోమవారం తన కుమారుడు అశ్విన్(3)తో కలిసి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. తండ్రి ఉత్తమ్, తమ్ముడు సంతోష్ మంగళవారం కాలువ వైపు వెళ్లగా సాగ్రీబాయి మృతదేహంలభ్యమైంది. ఈ విషయాన్ని పోలీసులకు సమాచారం అందించారు. కుమారుడి అశ్విన్ కోసం గాలిస్తున్నారు. మృతురాలి తమ్ముడు సంతోష్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

లైంగికదాడికి యత్నించిన కేసులో ఒకరికి జైలు

ఆసిఫాబాద్/కెరమెరి: లైంగికదాడికి యత్నించిన కేసులో కెరమెరి మండలం అగర్‌వాడ గ్రామానికి చెందిన చాకటి భీమ్‌రావుకు మూడేళ్ల జైలు శిక్షతోపాటు రూ.4 వేలు జరిమానా విధిస్తూ ప్రిన్సిపల్ జెఎఫ్‌సీఎమ్ కోర్టు మెజిస్ట్రేట్ జక్కుల అనంత లక్ష్మి మంగళవారం తీర్పునిచ్చారు. కెరమెరి ఎస్సై విజయ్ కథనం ప్రకారం.. ఏప్రిల్ 4, 2022న అగర్‌వాడకు చెందిన ఓ మహిళపై అదేగ్రామానికి చెందిన చాకటి భీమ్‌రావు లైంగికదాడికి యత్నించాడు. సదరు మహిళ అరవడడంతో పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదుతో అప్పటి ఎస్సై కళ్యాణ్ కేసు దర్యాప్తు చేపట్టారు. పీపీ అజయ్‌కుమార్ కోర్టులో సాక్షులను ప్రవేశ పెట్టగా నేరం రుజువవడంతో న్యాయమూర్తి ఈమేరకు తీర్పుచెప్పారు. నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన వాంకిడి సీఐ సత్యనారాయణ, కెరమెరి ఎస్సై విజయ్, ఆసిఫాబాద్ డివిజన్ లైజనింగ్ ఆఫీసర్‌ను ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అభినందించారు.

సోదరులకు రెండేళ్ల జైలు

- నేరం రుజువుతో న్యాయమూర్తి తీర్పు

బెల్లంపల్లి: ఒకరికి బదులు మరొకరు పరీక్ష రాసిన ఇద్దరికి బెల్లంపల్లి న్యాయస్థానం మంగళవారం జైలు శిక్ష విధించింది. వన్‌టౌన్ ఎస్‌హెచ్‌ఓ ఎన్.దేవయ్య కథనం ప్రకారం.. మున్సిపాలిటీ అంబేద్కర్ నగర్‌కు చెందిన ఎంబడి రాజేందర్ 2013లో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో ఇంటర్ ప్రథమ సంవత్సరం ఇంగ్లిష్ పరీక్ష రాయాల్సి ఉండగా వరుసకు సోదరుడైన అంబేద్కర్‌నగర్‌కు చెందిన ఎంబడి మల్లేశ్ హాజరయ్యాడు. పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ జి.సృజన రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై అప్పటి వన్‌టౌన్ సీఐ కె.స్వామి కేసు దర్యాప్తు చేశారు. ఆ తర్వాత వచ్చిన సీఐ ఎల్.రఘు నిందితులపై కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టు కానిస్టేబుల్ కె.సురేష్, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.అజయ్‌కుమార్ 12 మంది ప్రధాన సాక్షులను జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ (జేఎఫ్‌సీఎం) జె.ముకేశ్ ఎదుట హాజరుపర్చగా న్యాయమూర్తి విచారించారు. నేరం రుజువు కావడంతో ఎంబడి రాజేందర్, ఎంబడి మల్లేశ్‌లకు రెండేళ్ల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారని ఎస్‌హెచ్‌ఓ తెలిపారు.

రేపు ప్రభుత్వ ఉద్యోగులకు క్రీడా పోటీలు

మంచిర్యాలక్రైం: ఈ నెల 29న జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ ఉద్యోగులకు వివిధ క్రీడల్లో పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి కీర్తి రాజ్‌వీర్ ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని ప్రభుత్వ శాఖల మహిళా, పురుష ఉద్యోగులు 28న సాయంత్రం 5గంటల్లోపు తమ పేర్లు నమోదు చేసుకోవాలని, బాక్సింగ్ కోచ్‌ను 9963539234 నంబరులో సంప్రదించాలని తెలిపారు. మహిళలు, పురుషులు 50ఏళ్లలోపు, పైబడినవారు పాల్గొనవచ్చని, 100 మీటర్ల పరుగు, లెమన్‌స్పూన్, చెస్, మ్యూజికల్ చేర్, టగ్ ఆఫ్ వార్, షాట్‌పుట్ క్రీడలు నిర్వహిస్తామని తెలిపారు. కలెక్టరేట్‌లో 29న ఉదయం 10 గంటల నుంచి పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

గంజాయి నిర్మూలనకు సహకరించాలి



మాట్లాడుతున్న ఏసీపీ రవికుమార్

బెల్లంపల్లి: గంజాయి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని బెల్లంపల్లి ఏసీపీ ఎ.రవికుమార్ అన్నారు. మంగళవారం తెల్లవారుజామున పట్టణంలోని 20, 21, 22వ వార్డుల్లో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. డాగ్‌స్క్వాడ్‌తో అనుమానిత వ్యక్తుల ఇళ్లలో తనిఖీలు చేపట్టారు. ధ్రువీకరణ పత్రాలు లేని 45 ద్విచక్ర వాహనాలు, ఆటో స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా భూడిద గడ్డ చౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏసీపీ మాట్లాడారు. బెల్లంపల్లిలో అనుమానిత వ్యక్తులు సంచరించినా, ఆశ్రయం పొందినా పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐలు ఎన్.దేవయ్య, అఫ్జలుద్దీన్, బెల్లంపల్లి సబ్‌డివిజన్ పరిధిలోని ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

అలైన్‌మెంట్ మార్చాలని వినతి



ఆర్డీఓ ఏఓకు వినతిపత్రం అందిస్తున్న భాధితులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): అందరికీ ఆమోదయోగ్యమైన రెండవ అలైన్‌మెంట్ ప్రకారం మంచిర్యాల–ఆర్మూర్ నాలుగు వరసల జాతీయ రహదారి నిర్మాణం చేపట్టాలని ఎన్‌హెచ్ బాధితులు మంగళవారం ఆర్డీఓ కార్యాలయ ఏఓకు వినతిపత్రం అందజేశారు. ప్రజాభిప్రాయంలో గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి విస్తరణను వ్యతిరేకించినా ఎన్‌హెచ్ఏఐ మూడవ అలైన్‌మెంట్‌ను ఖరారు చేయడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. ఎన్‌హెచ్ఏఐ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతుల గోడు విని అలైన్‌మెంట్ మార్చేందుకు సిద్ధంగా ఉన్నారని, ఇక్కడి రెవెన్యూ అధికారులు బాధిత రైతుల పక్షాన నిలిచి మూడవ అలైన్‌మెంట్ రద్దు చేసి నోటీసులు వెనక్కు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎన్‌హెచ్ బాధితులు ఓడ్నాల శ్యాంసుందర్, గుర్రాల శశిధర్‌రెడ్డి, మంచికట్ల మల్లేశ్, లగిశెట్టి రాజమౌళి, మొగిళి తిరుపతి, అప్పాసు తిరుపతి, కస్తూరి మల్లేశ్, తోట రామయ్య, కొట్టె మహేశ్, నైనాల తిరుపతి, హాజీపూర్, లక్సెట్టిపేట మండలాలకు చెందిన పలువురు పాల్గొన్నారు.

సాయికుంట చెరువును కాపాడండి

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని సాయికుంట చెరువు శిఖాం భూమి కబ్జాకు గురైందని, కబ్జాదారుల నుంచి చెరువును కాపాడాలని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాయంలో సీనియర్ అసిస్టెంట్ స్వప్నకు వినతిపత్రం అందజేశారు. హైదరాబాద్ తరహాలో ఇక్కడ కూడా హైడ్రా చట్టం తెచ్చి కబ్జాలకు గురైన చెరువులను కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు సేక్ సల్మాన్‌పాష, జుమ్మిడి గోపాల్, చేరాల వంశీ, పూరెల్ల నితీష్, శివతేజ, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రకుంట చెరువు శిఖం కబ్జాపై విచారణ జరపాలి

బెల్లంపల్లి: బెల్లంపల్లి మండలం కన్నాల శివారు ఎర్రకుంట చెరువు శిఖం భూమి కబ్జాపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆరిజిన్ డెయిరీ సీఏఓ బోడపాటి శేజల్ డిమాండ్ చేశారు. మంగళవారం బెల్లంపల్లి తహసీల్దార్ జోత్స్నకు ఆరిజిన్ డెయిరీ సీఈఓ కందిమళ్ల ఆదినారాయణతో కలిసి వినతిపత్రం అందజేశారు. కన్నాల శివారు సర్వే నెంబర్ 45లో ఉన్న ఎర్రకుంట చెరువు శిఖం భూమి 3.11 ఎకరాలు అన్యాక్రాంతం చేసి స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య సైతం శిఖం భూమిని కబ్జా చేసి నివాసం ఏర్పాటు చేసుకున్నట్లు సమాచారం ఉందని తెలిపారు.

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు పూర్తి చేయాలి



మాట్లాడుతున్న డీపీఓ వెంకటేశ్వర్‌రావు

లక్సెట్టిపేట: ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు సకాలంలో పూర్తి చేసుకోవాలని జిల్లా పంచాయతీ రాజ్ అధికారి వెంకటేశ్వర్‌రావు అన్నారు. మంగళవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డుల వారీగా ఎంట్రీ చేయాలని అన్నారు. ప్రతీ గ్రామ పంచాయతీలో శానిటేషన్ పనులు వేగవంతం చేయాలని సూచించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన వారిపై శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సరోజ, ఎంపీఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఫోర్జరీ కేసులో మహిళకు రెండేళ్ల జైలు

బెల్లంపల్లి: డబ్బులు డ్రా కోసం ఓచర్‌పై బ్యాంకు మేనేజర్ సంతకాన్ని ఫోర్జరీ చేసిన కేసులో ఓ మహిళకు రెండేళ్ల జైలు శిక్ష పడింది. బెల్లంపల్లి టూటౌన్ ఎస్సై కె.మహేందర్ కథనం ప్రకారం..మండలంలోని బట్వాన్‌పల్లికి చెందిన ముక్కెర నాగలక్ష్మి 2012లో బెల్లంపల్లిలో దక్కన్ గ్రామీణ బ్యాంక్‌కు వెళ్లింది. డబ్బులు డ్రా కోసం ఓచర్‌పై మేనేజర్ సంతకాన్ని ఫోర్జరీ చేసి క్యాషియర్‌కు ఖాతా పుస్తకం, ఓచర్ అందజేసింది. అనుమానం వచ్చిన క్యాషియర్.. ఫోర్జరీ చేసినట్లుగా గుర్తించాడు. వెంటనే బ్యాంక్ మేనేజర్ వెంకటసత్యమూర్తి టూటౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. ఎస్సై ఎం.శ్యాంసుందర్, సీఐ మహేశ్‌బాబు కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టు మహిళా కానిస్టేబుల్ తిరుమల, ఏపీపీ కె.అజయ్‌కుమార్ 18 మంది సాక్షులను కోర్టులో హాజరుపర్చారు. బెల్లంపల్లి జుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ (జేఎఫ్‌సీఎం) జె.ముకేశ్ విచారించి నేరం రుజువు కావడంతో మంగళవారం నాగలక్ష్మికి రెండేళ్ల జైలుశిక్షతోపాటు రూ.వెయ్యి జరిమానా విధించారు.

డెంగీ, మలేరియా జ్వరాలు ప్రబలకుండా చర్యలు

బెల్లంపల్లి: డెంగీ, మలేరియా జ్వరాలు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని బెల్లంపల్లి డెప్యూటీ డీఎంహెచ్‌ఓ సుధాకర్ సూచించారు. బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్ చాంబర్‌లో కమిషనర్ కె.శ్రీనివాసరావు, చైర్‌పర్సన్ జె.శ్వేతతో మంగళవారం ఆయన సమావేశమై మాట్లాడారు. మున్సిపాలిటీ పరిధిలో డెంగీ, మలేరియా జ్వరాలకు కారణమయ్యే దోమల నివారణకు బ్లీచింగ్, స్ప్రే చేయించాలన్నారు.